క్లుప్తంగా

సూర్య ఘర్‌పై అవగాహన



సూర్య ఘర్ గురించి వివరిస్తున్న అధికారులు

తనకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ డీఈ మోసెస్ మాట్లాడుతూ సూర్య ఘర్ పథకంలో భాగంగా సబ్సిడీపై సోలార్ అందజేయనున్నట్లు తెలిపారు. సోలార్ ప్యానెల్స్ అమర్చుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించుకోవచ్చని చెప్పారు. మిగులు విద్యుత్ అమ్మకం వల్ల ఆదాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీటీ మల్లికార్జున, ఏఈ శ్రీకాంత్, లైన్‌మెన్లు బాబాఫక్రుద్దీన్, హరి, పలువురు సోలార్ కంపెనీ డీలర్లు పాల్గొన్నారు.

డైకిన్‌లో ప్లేస్‌మెంట్ శిక్షణ



శిక్షణ కోసం వెళ్లిన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సంస్కృతి ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఈఈఈ, ఎంఈ విద్యార్థులకు శ్రీసిటీలోని డైకిన్ సంస్థలో ప్లేస్‌మెంట్ ఓరియెంటెడ్‌పై వారం రోజుల శిక్షణ మంగళవారం ప్రారంభమైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రముఖ ఎయిర్ కండీషనర్ సంస్థ డైకిన్‌లో ఎయిర్ కండీషనింగ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలకు పరిశీలిస్తారని తెలిపింది.

బ్యాంకుల వద్ద నిరంతర నిఘా



ఎస్‌బీఐ మేనేజర్‌కు నోటీసు అందజేస్తున్న ఏఎస్‌ఐ

బత్తలపల్లి: దోపిడీలు, దొంగతనాలను నియంత్రించడంలో భాగంగా బ్యాంకుల వద్ద 24 గంటలూ నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఆన్ చేసి ఉంచాలని పోలీసులు బ్యాంకు మేనేజర్లను కోరారు. ఈ మేరకు మంగళవారం బత్తలపల్లిలోని అన్ని బ్యాంకులకూ ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, బరోడా బ్యాంకు మేనేజర్లకు ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి నోటీసులు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాంకు భద్రత కోసం 24/7 నిరంతరం సీసీ కెమెరాలతో నిఘా ఉండేలా, సేఫ్టీ అలారం, సెక్యూరిటీ గార్డు వంటివి ఏర్పాటు చేసుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

విధుల్లోకి చేరిన రామగిరి సీఐ

చెన్నేకొత్తపల్లి: స్థానిక సర్కిల్ కార్యాలయంలో రామగిరి సీఐ శ్రీధర్ మంగళవారం తిరిగి విధుల్లో చేరారు. గత నెల 27 నుంచి సీఐ సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి సమీపంలో హెలీప్యాడ్‌లో హెలీక్యాప్టర్ విండ్‌షీల్డ్ డ్యామేజీ, ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై 14 మంది లైంగిక దాడి, ఎంపీపీ ఎన్నిక, పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను టీడీపీకి చెందిన వారు హత్య చేయడం లాంటి కేసులు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. దీంతో సీఐ నెల రోజులు సెలవుపై వెళ్లారు. ఈసందర్భంగా పలువురు ఎస్‌ఐలు సీఐను మర్యాదపూర్వకంగా కలిశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం సుబ్బారావుపేట గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యతో కలిసి ఆయన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చట్టాలపై అవగాహన పెంచుకొని చట్ట పరిధిలోనే జీవించాలన్నారు. పిల్లలను బాగా చదివించుకొని వారి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

గరుడ పంచమి నోములు

ముదిగుబ్బ: నాగుల చవిత పండుగను పురస్కరించుకొని ముదిగుబ్బలో మంగళవారం ముత్తయిదువులు గరుడ పంచమి నోములు చేపట్టారు. గణేశా హరిహర దేవాలయంలో శ్రావణమాసం మంగళప్రదమైన సుమంగళితనాన్ని ప్రసాదించే మంగళ గౌరీ పూజలు చేశారు. పుట్టలకు ప్రత్యేక పూజలు చేసి ఆవు పాలు సమర్పించారు. నాగుల స్వాములతో పాటు ప్రసన్న ఆంజనేయస్వామికి వివాహిత, అవివాహిత, స్త్రీలచే అర్చకులు రఘునాథశాస్త్రి గరుడ పంచమి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేయించారు.



నల్లచెరువులో నాగ దేవతకు పూజలు చేస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

నల్లచెరువు: మండల కేంద్రం నల్లచెరువులోని బసవన్న కట్ట వద్ద మంగళవారం నాగుల చవితి వేడుకలను ఆర్య వైశ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాగ దేవతను పూజిస్తూ పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

బ్యాంకుల భద్రతపై అప్రమత్తం



ముదిగుబ్బలో బ్యాంక్ అధికారులకు సూచనలిస్తున్న సీఐ శివరాముడు

ముదిగుబ్బ: హిందూపురం మండలం తూముకుంట ఇండ్రస్టియల్ ఏరియాలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో భారీ చోరీ జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బ్యాంకుల వద్ద భద్రత పటిష్టతపై చర్యలు చేపట్టారు. బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని, సీసీ కెమెరాలతో నిఘాను పటిష్టం చేసుకోవాలని ముదిగుబ్బ సీఐ శివరాముడు బ్యాంక్ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని బ్యాంక్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. బ్యాంకుల వద్ద అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు 'బాదుడు' ఎవరి జేబులోకో..?

- అక్రమ కేసులు కాదు.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి
- కందికుంటకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవణీత్‌రెడ్డి హితవు

కదిరి టౌన్: మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యి ఎమ్మార్పీపై అదనంగా దండుకుంటున్న డబ్బు ఎవరి జేబులోకి వెళ్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని అడపాలవీధిలోనున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరాక మద్యం విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారన్నారు. పట్టణంలో మద్యం బాటిల్‌పై అదనంగా రూ.30 వసూలు చేస్తున్నారని, ఈ సొమ్మంతా ఎవరికి చేరుతోందో పాలకులే తెలపాలన్నారు. అధికారం ఉంది కదా అని, ఏదైనా చెయ్యొచ్చు అని చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అభివృద్ధి వైపు అడుగులు వేయండి

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు, కుట్రపూరిత చర్యలు పక్కనపెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేస్తే మంచిదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ప్రణీత్‌రెడ్డి హితవు పలికారు. ప్రజలు అవకాశం ఇచ్చారని, సద్వినియోగం చేసుకుంటే అందరూ హర్షిస్తారన్నారు. పవిత్రమైన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరును అభివృద్ధి చేయండి కదిరికి మంచిది.. లేకపోతే అందరికీ అరిష్టమని అన్నారు. భక్తులు పుణ్యస్నానాలాచరించే కోనేటిలోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మీ ఆస్తులెందుకు.. స్వామి స్థలం వదిలేయ్

ఊ.. అంటే నరసింహస్వామి ఆలయానికి ఆస్తులు రాసిస్తామని కందికుంట వెంకటప్రసాద్ అంటున్నారని.. మీ ఆస్తులు ఎవరికి కావాలి.. మీరు ఆక్రమించిన నరసింహస్వామి ఆలయ స్థలాన్ని వదిలేయండి అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నీతులు చెప్పడం కాదు.. ఆచరించి చూపాలని హితవు పలికారు. వీవర్స్‌కాలనీలో మూడు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారని, ఎవ్వరైనా



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రణీత్‌రెడ్డి

ఎదురు తిరిగితే వారిపై పోలీసులతో కేసులు బనాయిస్తారని ఇది మీ స్థాయికి తగదని అన్నారు. స్టాంపు రైటర్లతో మీరు సమావేశం నిర్వహించడమేంటి, ఏ ఎమ్మెల్యే అయినా ఇలా చేశారా.. ఎందుకిలా స్థాయి దిగజార్చుకుంటారు అని హితవు పలికారు.

అక్రమ కేసులకు భయపడం

కూటమి ప్రభుత్వం వచ్చాక కక్షసాధింపు చర్యల్లో భాగంగా తమ శివసాయి కన్‌స్ట్రక్షన్ క్వారీపై మూడు దఫాలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పొల్యూషన్ అధికారులతో దాడులు చేయించారని ప్రణీత్‌రెడ్డి అన్నారు. గత ఏడాది రూ.12.80 కోట్లను జిల్లా మైన్స్ అధికారులతో ఫైన్ వేయించారన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా.. దాన్ని రద్దు చేసి.. క్రషర్ నడుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా మైన్స్ అధికారులను ఆదేశించిందన్నారు. అలా 30 రోజులు కూడా కాకముందే నిబంధనలు ఉల్లంఘించారంటూ సోమవారం మళ్లీ క్వారీలో సోదాలు, సర్వేలు చేపట్టారన్నారు. ఇదంతా కందికుంట కక్ష పూరిత చర్య అని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేదే లేదని స్పష్టం చేశారు.

విమర్శలు చేసే స్థాయి మీకు లేదు

మంత్రి పదవిని ఆశిస్తూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై అవాకులు చెవాకులు పేలడం మంచిది కాదని కందికుంటకు ప్రణీత్‌రెడ్డి సూచించారు. సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదన్నారు. మీకు నందమూరి తారకరామారావు ఎంతో.. మాకు మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అంత అని అన్నారు. అనవసరంగా వారిపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కక్షలు, కుట్రలు, కుతంత్రాలు వదిలి ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడితే అభినందిస్తామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కౌన్సిలర్ లింగాల కృపాకర్‌రెడ్డి, నాయకులు గంగాధర్, షకీల్, రమేష్‌యాదవ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: అనంతపురం టీవీ టవర్ సమీపంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగే వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ జోలా రామచంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పేరుతో నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి అన్ని మండలాల్లోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి

బత్తలపల్లి: ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఫర్టిలైజర్స్ షాపుల నిర్వాహకులను ధర్మవరం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీ) లక్ష్మానాయక్ ఆదేశించారు. మంగళవారం బత్తలపల్లి రైతు సేవ కేంద్రం పరిధిలోని గడుపూటి రమేష్‌బాబు పొలంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏడీ ముఖ్య అతిథిగా హాజరై సమగ్ర యాజమాన్యం, సాగు పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు చేపట్టాలని సూచించారు. పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా



ఎరువుల దుకాణదారులతో మాట్లాడుతున్న ఏడీ లక్ష్మానాయక్

రసీదు తీసుకోవాలని రైతులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం



సమస్యలను పరిశీలిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు



విద్యార్థులతో సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నేతలు పురుషోత్తం, అమర్‌నాథ్‌రెడ్డి

- వైఎస్సార్ విద్యార్థి విభాగం నేతల హెచ్చరిక

ధర్మవరం: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం ధర్మవరంలోని బాలికల వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మరుగుదొడ్లు, గదులు, తాగునీటి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా హాస్టళ్ల భవనాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడం.. పక్కాభవనాలు నిర్మించడం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాస్మొటిక్ చార్జీలు, మెస్ చార్జీలు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని కోరారు. విద్యాశాఖ అధికారులు వారంలో ఒకరోజు వసతిగృహాల్లో బస చేసి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వార్డెన్లు తప్పనిసరిగా హాస్టళ్లలో ఉండాలన్నారు.

బీసీ హాస్టల్ పరిశీలన

కదిరి అర్బన్: పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న బీసీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం రాత్రి వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదన్నారు. వసతిగృహంలో విద్యార్థులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రయాదవ్, నిఖిల్‌రెడ్డి, ఫయాజ్, ఇర్ఫాన్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

రస్తా ఏర్పాటుకు చర్యలు



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్

ముదిగుబ్బ: ముదిగుబ్బలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కళాశాలకు రస్తా లేకుండా పెద్ద గుంత తవ్వారు. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడటంతో విద్యార్థులు రెండు రోజుల క్రితం రస్తా కోసం ధర్నా చేశారు. రస్తా సమస్య పరిష్కరించడానికి తహసీల్దార్ నారాయణస్వామి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్‌ఓ, సర్వేయర్ మంగళవారం చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌తో కళాశాలకు ఏర్పాటు చేసే రస్తాపై చర్చించారు. త్వరలోనే రస్తాను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యలపై ప్రస్తావనేదీ?

అమడగూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి ప్రజాప్రతినిధులు ప్రస్తావించకుండా మండల సమావేశం మమ అనిపించారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. అయితే గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ మాట్లాడక పోవడం గమనార్హం. కార్యక్రమంలో తహసీల్దార్ రామనాథరెడ్డి, ఈఓఆర్డీ రాజశేఖర్, ఎంఈఓ జిలాన్‌బాషా, హాస్టల్ వెల్ఫేర్ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం ప్రారంభం

పుట్టపర్తి: బుక్కపట్నంలోని షిరిడీసాయి కాలనీలో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహాన్ని మంగళవారం మంత్రి సవిత ప్రారంభించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్టళ్ల రూపురేఖలు మారుస్తామని తెలిపారు. వారం రోజుల్లోగా వసతి గృహానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

పని గంటల పెంపు సరికాదు

ధర్మవరం: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ధర్మవరం మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ కార్మికులకు పనిగంటలు అదనంగా పెంచడాన్ని సీఐటీయూ నాయకులు తప్పుపట్టారు. ఎనిమిది గంటల నుంచి 12 గంటలు విధులు నిర్వర్తించేలా పనివేళలు పెంచడం ఏమిటని కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను ఇంజినీరింగ్ కార్మికులు, సీఐటీయు నాయకులు నిలదీశారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ ఔట్ సోర్సింగ్ కార్మికులు 25 సంవత్సరాల నుంచి ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని కొన్నిరోజులుగా కార్మికులతో 12 గంటల పాటు పని చేయిస్తూ పనిభారం పెంచారన్నారు. స్పందించిన కమిషనర్ 8గంటల పని విధానాన్ని కొనసాగించేలా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, గణేష్, రమణ, నాగరాజు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మున్సిపాలిటీ అవినీతిపై లోకాయుక్తలో ఫిర్యాదు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై న్యాయవాది గోవిందరాజులు మంగళవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సంగం శ్రీనివాసులు డిసెల్టేషన్‌లో చేయని పనులకు బిల్లులు పెట్టించుకోవడం , పాత పనులకు కేవలం ఫొటోలు దిగి బిల్లులు మంజూరు చేయించుకోవడం, మార్కెట్ వేలంపాటలో అవినీతికి తెరతీసి మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టడం, డంపింగ్ యార్డు లో రూ.4 కోట్లు స్కామ్, మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరులో మున్సిపాలిటీ స్థలాన్ని అక్రమించుకొని షెడ్డు నిర్మాణం, సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాల్సిన బిల్లులు మున్సిపాలిటీ చెక్కులను నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని ఫిర్యాదు చేసినట్లు గోవిందరాజులు తెలిపారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన శోభన్‌రెడ్డి, డీఈఈ మోహన్, ఏఈ శంకర్, డ్రాఫ్ట్స్‌మెన్ ఆనందరాజు, అకౌంటెంట్ మనోహర్ సహకారంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కాంట్రాక్టర్ ప్రభాకర్‌తో పాటు పలువురు లబ్ధి పొందారన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ పేర్కొన్నారు. కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపక (సివిక్స్) ఆంగ్లం, తెలుగు మాధ్యమంలో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.

ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా



ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం అర్బన్: ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులోనున్న ఈవీఎం గోడౌన్లను ఆయన తనిఖీ చేశారు. ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ల వద్ద ప్రత్యేక భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. సీసీ కెమెరా వ్యవస్థ, ఫైర్ సేఫ్టీ, 24గంటల భద్రతా ఏర్పాట్లపై నిఘా ఉంచాలన్నారు. ఈవీఎంల భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే జీవితానికి సార్థకత



పేదలకు కిట్లను అందజేస్తున్న రత్నాకర్ రాజు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: సమాజ సేవ చేయడం ద్వారా ప్రతి ఒక్కరి జీవితానికీ సార్థకత చేకూరుతుందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు పేర్కొన్నారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన 150 మంది సత్యసాయి భక్తులు మంగళవారం కదిరి పరిసర తొమ్మిది మండలాలకు చెందిన 500 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు చేతుల మీదుగా ప్రజలకు సేవా కిట్లు అందజేశారు. రత్నాకర్ రాజు మాట్లాడుతూ సత్యసాయి మానవసేవయే మాధవ సేవ అని బోధించారని, ఇదే స్ఫూర్తితో భక్తులు సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. కదిరికి వెళ్లిన భక్తులకు అక్కడి ప్రజలు, సత్యసాయి భజన మండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తుడు తోట్ల గంగాధర్, అంజి పాల్గొన్నారు.

పాశ్చాత్య భక్తుల సంగీత వైభవం

ఇటాలియన్, స్పానిష్ సత్యసాయి భక్తులు సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించి భక్తులను మైమరపింపజేశారు. పాశ్చాత్య సంగీత రీతులతో చక్కటి భక్తిగీతాలను ఆలపించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

గాండ్లపెంట: వేరుశనగ పంటలో సమగ్ర యాజమాన్య, సస్య రక్షణ పద్ధతులు పాటించాలని కదిరి ఏడీఏ సనావుల్లా రైతులకు సూచించారు. మంగళవారం ఎన్పీ కుంట వ్యవసాయాధికారి కార్యాలయంలో 'ఆత్మ' ఆధ్వర్యంలో ఏడీఏ అధ్యక్షతన రైతులకు శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్షలు చేయించి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని ఏడీఏ సూచించారు. మల్చింగ్ విధానం పాటించి జీవన ఎరువులు వినియోగించడం వల్ల పది శాతం ఎరువులను ఆదా చేయవచ్చన్నారు. శిక్షణ అనంతరం సచివాలయాల్లో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను ఏడీఏ, వ్యవసాయాధికారి సన్మానించారు. బదిలీపై ఎన్పి కుంట మండలానికి వచ్చిన సిబ్బందికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ పార్థసారథి, మండల వ్యవసాయాధికారి లోకేశ్వరరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



ఎన్పీకుంటలో మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

నల్లచెరువు: ఓరువాయి గ్రామంలో ఏఓ లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కదిరి ఏడీఏ సనావుల్లా పాల్గొని రైతులకు సబ్సిడీపై అందిస్తున్న డ్రోన్లు, డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వేరు శనగ పంటకు ఆశించే చీడపీడలు వాటి నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఏటీటీసీ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, డీడీఏ డీఆర్‌సీ రామునాయక్, ఏడీ డీఆర్‌సీ శైలజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఎగువపల్లిలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం బడి' నిర్వహించారు. పుట్టపర్తి రిసోర్స్ సెంటర్ డీడీఏ రామానాయక్ హాజరై గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించి.. సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎరువుల వాడకం, పోషకాలు ఇవ్వడం, తెగుళ్లనివారణ పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ రామసుబ్బయ్య, ఏఓ శ్రీహరినాయక్, రెడ్స్ సంస్థ ప్రతినిధులు ఎల్లప్ప, ఉమామహేశ్వరితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.